క్లుప్తంగా

గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు

అంబాజీపేట: చీకటి పడేసరికి దోమలు విజృంభిస్తుండటంతో కంటికి కునుకు కరువవుతోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా రోగాల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. దోమల నివారణ కోసం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, పూడికలు తొలగించడకపోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి దోమల నివారణ చర్యలు తీసుకుని ప్రజలను రక్షించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

గద్దర్ మృతి సాహితీ లోకానికి తీరని లోటు



హైదరాబాద్‌లో మట్టి రాతలు పుస్తకావిష్కరణలో గద్దర్‌తో ప్రతాప్ (ఫైల్)

సఖినేటిపల్లి: ప్రజాగాయకుడు గుమ్మడి విఠల్ రావు(గద్దర్) మృతి సాహితీ లోకానికి తీరని లోటని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఆదివారం వీవీమెరకలో ఆయన మాట్లాడుతూ, గద్దర్‌తో ఉన్న తన అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. తమ్ముడూ అంటూ తనను ఆప్యాయంగా పిలిచే గొంతు మూగబోవడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌లో తన మట్టిరాతలు పుస్తక ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారని, మట్టి మనుషుల రాతలే నీ కవిత్వం అంటూ ఆయన అభినందించారన్నారు. ఒక సాహితీ విప్లవ జ్యోతిని కోల్పోయామన్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలిపారు.

కొత్తపేట: విప్లవ కవి, ప్రజా గాయకుడు గుమ్మడి విఠల్‌రావు (గద్దర్) మృతికి కొత్తపేట కళా సాహితి సంతాపం ప్రకటించింది. గద్దర్ సమాజంలోని సామాజిక రుగ్మతలపై తన గళంతో ఎలుగెత్తి చాటి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని ప్రముఖ కవి, రచయిత కళాసాహితీ ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు పేర్కొన్నారు. గద్దర్ మృతి తీరని లోటని పేర్కొంటూ ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళ రాజు, సభ్యులు షేక్ గౌస్, ఏబీసీ దేవ్, ఏడిద సత్తిరాజు, వులుసు వీవీ సుబ్బారావు గద్దర్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ ములికిపల్లి కన్వీనర్ మృతి



కోన వెంకటేశ్వర్లు

రాజోలు: వైఎస్సార్ సీపీ ములికిపల్లి గ్రామ కన్వీనర్ కోన వెంకటేశ్వర్లు (47) కిడ్నీలు పాడై ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతికి రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, జెడ్పీటీసీ మట్టా శైలజ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

10న కలెక్టరేట్ వద్ద బీజేపీ ధర్నా

సఖినేటిపల్లి: ఈ నెల 10న పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలంకలో పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివ రామ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగేష్ మాట్లాడారు. మండలంలో ఉన్న పంచాయతీ సర్పంచ్‌లను, వార్డు సభ్యులను పై ధర్నాకు ఆహ్వానించామన్నారు. జిల్లా నాయకులు పట్టపు సూర్యప్రకాశరావు, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సిద్ధాంతాలను వివరించాలి

అంబాజీపేట: బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) సిద్ధాంతాలు, విధి విధానాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి చైతన్య పరచాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కా పరంజ్యోతి అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న సామాజిక భవనంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో ఒక్కరోజు శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్ర వర్ణ పేదలు తమ ఓటు ద్వారా పాలకులు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతా సత్యనారాయణ, ట్రెజరర్ సాకా రాజారావు, కాంద్రేగుల నరసింహులు, ములపర్తి చందు తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు వస్త్రాల పంపిణీ

అంబాజీపేట: పుల్లేటికుర్రుకు చెందిన బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి, లయన్స్ క్లబ్ అమలాపురం మెంబర్ బెహరా వీర హనుమంతరావు, వెంకట సత్య సూర్యకుమారి దంపతులు ఆధ్వర్యంలో ముక్కామల వేద పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలను ఆదివారం పంపిణీ చేశారు. కంచి కామకోటి 70వ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారి ఆధ్వర్యంలో వెలవలపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రిరి స్వగృహంలో పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. అలాగే వేద పాఠశాల అధ్యాపకులకు, కమిటీ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి సత్కరించారు.

నిండా ముంచిన వరద

- కుళ్లిపోయిన కూరగాయల తోటలు
- ఆందోళనలో రైతులు



పెదపట్నంలంకలో వరద ముంపుతో చనిపోయిన పందిరి బీర

మామిడికుదురు: ఆరుగాలం శ్రమించి పండించిన పంట గోదావరి పాలయింది. ఎంతో కష్టపడి సాగు చేసిన కూరగాయల తోటలను గోదావరి వరద ముంచెత్తింది. పెట్టుబడులు పెట్టి పంట పక్వానికి వస్తుందని ఆశిస్తున్న తరుణంలో రైతుల ఆశలపై గోదావరి నీళ్లు చల్లింది. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఆదాయం వస్తుందని ఆశించిన రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో సాగు చేసిన బీర, బెండ, వంగ, మునగ, చిక్కుడు, అరటి, బొప్పాయి, తమలపాకు, పసుపు, పువ్వులు తదితర పంటలు ముంపు బారిన పడడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముంపు నుంచి తేరుకుంటున్న తోటలు క్రమేపీ రంగు మారి పండుటాకులుగా మారిపోతున్నాయి. వంగ తోటలు కుళ్లిపోయాయి. మునగ తోటలు సైతం ఎండిపోతున్నాయి. మూడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 450 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశారు.

ఏటా ఇదే పరిస్థితి..

వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేయడం. తీరా అవి పంట అందించే దశలో గోదావరి వరద వచ్చి మాకు తీరని నష్టాన్ని కలిగించడం పరిపాటిగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే కూరగాయల తోటలు కాపునకు వచ్చాయని, కోత కోసే దశలో గోదావరి వరదతో పంటలు తుడిచి పెట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పంటలు పండించి అవి ఉత్పత్తి దశకు వచ్చే సరికి మూడు నెలలు సమయం పడుతుందని చెబుతున్నారు. ఇంకా వరదలకు రెండు నెలలు సమయం ఉందని పేర్కొంటున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా వరదలు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు. అక్టోబరు నెలలో కానీ లంక గ్రామాల్లో కూరగాయలు సాగు చేసే సావకాశం లేదని అంటున్నారు.



పెదపట్నంలంకలో గోదావరి వరదకు దెబ్బతిన్న మునగ తోట

నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మునగ తోటలకు నష్టం వాటిల్లింది



నేను, నా సోదరుడు సుబ్బారావు కలసి నాలుగు ఎకరాల్లో బీర, బెండ, మునగ పంటలు సాగు చేశాం. రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాం. ఆదాయం వచ్చే సమయంలో వరద మా కూరగాయల తోటలను ముంచెత్తింది. మొత్తం పంటంతా తుడిచి పెట్టుకుపోయింది. పెట్టుబడితో సహా రూ.రెండు లక్షల ఆదాయం కోల్పోయాం. ఏం చేయాలో పాలు పోని పరిస్థితి. మమ్మల్ని ఆదుకోవాలి.

– కుంపట్ల వీరబాబు, పెదపట్నంలంక

రెండెకరాలు పోయింది



మూడు నెలల క్రితం రెండెకరాల్లో బీర పాదులు, మునగ పంట సాగు చేశా. రూ.30 వేలు పైబడి పెట్టుబడి పెట్టా. ఇప్పుడిప్పుడే పంట కోతకు వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఒక్కసారిగా వచ్చిన వరద మాకు తీరని నష్టాన్ని మిగిల్చింది. రెండు పంటలు మొత్తం పాడైపోయాయి. పెట్టుబడి సైతం దక్కని పరిస్థితి. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి. ప్రభుత్వం సహాయం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– యేడిద నాగేశ్వరరావు, పెదపట్నంలంక

నాలుగు పంటలు పాడైపోయాయి



15 కుంచాల్లో మునగ, చిక్కుడు, బీర, వంగ పంటలు సాగు చేశా. రూ.40 వేలు వరకు పెట్టుబడి పెట్టా. నాలుగు పంటలను గోదావరి వరద నీరు ముంచెత్తింది. ఎంతో కష్టపడి పంటలు పండించాం. తీర కోత దశకు వచ్చే సరికి వరద మా పాలిట శాపంగా మారింది. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి. చాలా నష్టం వచ్చింది. మాకు ప్రభుత్వం అండగా నిలవాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– యేడిద సూర్యనారాయణ, పెదపట్నంలంక

సంక్షేమ సంఘం సేవలు ప్రశంసనీయం



విద్యార్థిని మడికి జెస్సీకి ప్రతిభా పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మామిడికుదురు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన సంక్షేమ సంఘం సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు అధ్యక్షత వహించారు. 2022–23లో ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఎమ్మెల్యే చిట్టిబాబు చేతుల మీదుగా అందజేశారు. ఇంటర్, 10వ తరగతితో మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారితో పాటు గ్రామాల వారీగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహాలు, షీల్డులు, పతకాలు అందించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించే దిశగా సంక్షేమ సంఘం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ప్రతిభా పురస్కారాలు అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే చిట్టిబాబు అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చిట్టిబాబు అభిలషించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తుల నకుల రాజు, సీడీపీఓ యడ్ల విజయశ్రీ, రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు, గోసంగి బంగార్రాజు, పెయ్యల వీరభద్రరావు, బత్తుల రమేష్‌బాబు, బయ్యా మోహనరావు, సాధనాల సత్యనారాయణ, సంఘం ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్‌బాబు, కోశాధికారి నేల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పొన్నమండ' జయంతి

రాజోలు: అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి జయంతిని ఆదివారం రాజోలు మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. నేడు లక్ష్మణస్వామి స్వగ్రామం తాళ్లరేవు మండలం కోరంగిలో ఉత్సవాలు జరుగుతాయని నాయకులు వివరించారు.

కవి మల్లిక్‌కు సత్కారం

ఆలమూరు: స్థానిక జెడ్పీ గరల్స్ హైస్కూల్ తెలుగు పండిట్, ప్రముఖ కవి కామవరపు మల్లికార్జున రావు (మల్లిక్)కు ఆదివారం ఘన సత్కారం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో అఖిల భారత బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. మల్లిక్‌ను సత్కరించడంపై మండల బ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

ఆబోతును రక్షించిన స్థానికులు

మలికిపురం: గ్రామంలోని ప్రధాన పంట కాలువలో శనివారం రాత్రి ఒక ఆబోతు ప్రమాదవశాత్తూ పడిపోయింది. అప్పటి నుంచి ప్రాణాపాయంలో బయటకు రాకుండా ఉన్న ఆబోతును స్థానికులు ఆదివారం సాయంత్రం రక్షించారు. ఈ పంట కాలువ పూర్తిగా డ్రైన్‌గా మారడంతో పూర్తి బురదలో ఆబోతు కూరుకుపోయి రాత్రి నుంచీ విలవిలలాడింది. దీంతో స్థానికులు పొక్లెయిన్‌తో కాపాడారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో మంత్రవాది ఇందిరాకుమారి స్మారక వైద్యాలయంలో మంగళవారం ఉదయం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవల్లి నాగేశ్వరరావు తెలిపారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ముంగండలో విద్యార్థులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్న కోచ్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తైకాండో కోచ్, బ్లాక్ బెల్ట్ సెకండ్ నేషనల్ రిఫరీ మోకా శ్రీనివాసరావు అన్నారు. ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆయన విద్యార్థులకు తైకాండోపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని, తైక్వాండో ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని వివరించారు. తైక్వాండో వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ముంగండ వీఆర్వో దొరబాబు విద్యార్థులకు పౌష్టికాహారం అందించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు జక్కంపూడి



ఈదరాడలో జక్కంపూడి చిత్రపటానికి ఎమ్మెల్యే వరప్రసాదరావు నివాళి



ఆలమూరులో పేదలకు వస్త్రదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



రావులపాలెంలో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మామిడికుదురు: బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం మాజీ మంత్రి, దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఎంతో శ్రమించారని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శ్లాఘించారు. జక్కంపూడి 70వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఈదరాడలో రామ్మోహనరావు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్య, యెరుబండి సూరిబాబు, వద్దే ఆదిబాబు, కుసుమ శ్రీధర్, యెరుబండి సత్యనారాయణమూర్తి, చేట్ల సత్యనారాయణ, నయినాల సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఒక పోరాట యోధుడని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు ఆధ్వర్యాన రామ్మోహనరావు జయంతిని మామిడికుదురు సెంటర్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. రామ్మోహనరావు చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పార్టీ నేతలు కొమ్ముల రాము, కటకంశెట్టి ఆదిత్య, గౌస్ మొహిద్దీన్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, వర్ధినేని రాము, జోగి రామకృష్ణ, పిల్లి శ్రీను, ఎండీవై షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరులో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నేత కర్రి నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిసర ప్రాంతాల నుంచి పార్టీలకతీతంగా అనేక మంది అభిమానులు మాజీ మంత్రి జక్కంపూడి జయంతిలో పాల్గొన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు వంద మంది పేదలకు వస్త్రదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గా భవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, వైఎస్సార్సీపీ నాయకులు చల్లా నానాజీ, చల్లా భూషణం, జొన్నాడ అబ్బు, శ్రీపతి వీర్రాజు, నామన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అడ్డగళ్ల వెంకట సాయిరామ్ అన్నారు. సాయిరామ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అక్విడెక్టు పార్కులో జక్కంపూడి జయంతిని నిర్వహించారు. జక్కంపూడి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి సందర్భంగా ఆదివారం రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఆయన ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజోలు: మాజీ మంత్రి జక్కంపూడి సేవలు చిరస్మరణీయమని రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. ఆదివారం తాటిపాకలో జక్కంపూడి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఆదివారం మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతిని పార్టీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో జక్కంపూడి అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

మళ్లీ జగన్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఈదరాడలో జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతుల్ని చేశారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాయన్నారు. ఈ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే వరప్రసాదరావు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షుడు యెరుబండి సత్యనారాయణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్లు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్య, పార్టీ నేతలు యెరుబండి సూరిబాబు, సూరిశెట్టి బాబి, చేట్ల సత్యనారాయణ, కుసుమ పెరుమాళ్లకుమార్ తదితరులు పాల్గొన్నారు. పలువురు జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వరప్రసాదరావు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చంద్రబాబు కవ్వింపుతోనే దాడులు



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఈదరాడలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: టీడీపీ అధినేత చంద్రబాబు కవ్వింపు చర్యల వల్లే పుంగనూరులో టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆరోపించారు. చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ ఈదరాడలో ఆదివారం ఎమ్మెల్యే వరప్రసాదరావుతో పాటు పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఒక పథకం ప్రకారం రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. పుంగనూరులో దాడులు చేసిన వారిపైన, దాడులకు పాల్పడిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, యెరుబండి సూరిబాబు, వద్దే ఆదిబాబు, గౌస్ మొహిద్దీన్, కుసుమ శ్రీధర్, తులా గోపాలకృష్ణ, యెరుబండి సత్యనారాయణ మూర్తి, చేట్ల సత్యనారాయణ, వర్ధినేని రాము పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం

ప్రాజెక్టుల సందర్శన పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజల్ని రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పుంగనూరులో చంద్రబాబు రెచ్చగొట్టడం వల్లే టీడీపీ శ్రేణులు పోలీసులపైన, వైఎస్సార్ సీపీ కార్యకర్తల పైనా దాడి చేశారని ఎమ్మెల్యే చిట్టిబాబు ఆరోపించారు. పుంగనూరులో దాడులను నిరసిస్తూ ఆదివారం ఎమ్మెల్యే చిట్టిబాబు ఆధ్వర్యంలో మామిడికుదురులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని చిట్టిబాబు ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచే దమ్ము లేక శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు. నిరసనలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అయినవిల్లి: పుంగనూరులో టీడీపీ నేతల విధ్వంసకాండ అమానుషమని మండలం వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం ముక్తేశ్వరం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

వదిలేయలేని బంధం స్నేహమొక్కటే



అంబాజీపేటలో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: జీవితంలో మర్చిపోలేని మనుషులు, వదిలేయలేని బంధాలు కొన్ని ఉంటాయని దానిలో స్నేహం ఒకటని పలువురు పేర్కొన్నారు. అంబాజీపేట మండలంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. స్నేహితులు అందుబాటులో ఉన్నవారు ఒకరినొకరు కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. దూరంగా ఉన్నవారికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1983–84 పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకుని స్నేహితుల దినోత్సవాన్ని సంబరాలు చేసుకుంటూ నిర్వహించుకున్నారు.

ఉల్లాసంగా స్నేహితుల దినోత్సవం



షేక్ గౌస్, దెందులూరి ప్రసాద్



పెద్దింటి రామం, మహ్మద్ బాషా

కొత్తపేట: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం స్నేహితులు వ్యక్తిగతంగా, బృందాలుగా కలసి స్నేహితుల దినోత్సవం జరుపుకొన్నారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా స్థానికంగా ఉన్నవారు స్వయంగా కలసి ఫ్రెండ్షిప్‌కు గుర్తుగా బేండ్స్ కట్టుకున్నారు. స్థానికేతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడో ఉన్న స్నేహితులు ఫోన్లలో స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

వరద ముంపు బాధితులకు సాయం పంపిణీ



అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో బాధితులకు సాయం పంపిణీ చేస్తున్న మనోహర్

సఖినేటిపల్లి: రాజోలు దీవిలోని వరద ముంపు గ్రామాల్లో ఎంపిక చేసిన 50 మంది బాధిత కుటుంబాలకు తిరుపతి కేంద్రంగా ఉన్న పీపుల్స్ చారిటీ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మనోహర్ ఆదివారం సాయం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2 వేలు విలువైన రైస్ బ్యాగ్‌లను, 17 రకాల నిత్యావసరాలు, ఆయిల్స్ ప్యాకెట్లతో కూడిన కిట్లను ఆయన అందజేశారు. సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లోను, రాజోలు, మలికిపురం వరద ముంపు గ్రామాల్లోను వీటిని ఇచ్చారు. తహసీల్దార్ వై.రామకుమారి పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల వీఆర్వోలు, వలంటీర్లు సహకరించారని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా మానవతామూర్తులు గ్రూప్ అడ్మిన్ బోణం రాజు వ్యవహరించారు. సేవా కార్యకర్తలు ఒ.బాలరాజు, వాకా రాంబాబు, గిడుగు తాతాలు, ఆకుల వెంకటేష్, కుంపట్ల ముని, అల్లూరు మధురాజు పాల్గొన్నారు.

రామకోటికి ఘన నివాళులు

రావులపాలెం: ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పినతండ్రి దివంగత చిర్ల రామభద్రారెడ్డి(రామకోటి) ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం గోపాలపురం సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్గిరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టాల్లో ఉండే గోపాలపురం సొసైటీని నిల్వలోకి తీసుకురావడానికి ఎనలేని కృషి చేశారన్నారు. రైతులతో మమేకమవుతూ వారి కష్టనష్టాలు తెలుసుకుని వారికి అండగా ఉండేవారని, రామకోటి లేని లోటు తీర్చలేనిదన్నారు.

రూ.4.02 కోట్లతో గ్రామాభివృద్ధి



అవిడి గ్రామంలో సీసీ రోడ్డు కొలతలు వేయిస్తున్న సర్పంచ్ చంటి

కొత్తపేట: ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవిడి గ్రామం గణనీయమైన అభివృద్ధి సాధించినట్టు సర్పంచ్ రెడ్డి చంటి తెలిపారు. తన హయాంలో సుమారు రూ.4.02 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలు, స్కూలు భవనాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న పలు రోడ్ల నిర్మాణం పనులను సర్పంచ్ చంటి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పుల్లెలవారిపేట, శ్మశానం రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాటాలడుతూ తన హయాంలో గ్రామాభివృద్ధిని వివరించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి, సహకారంతో ప్రధానమైన మార్కెట్–కట్వలాంబిక అమ్మవారి ఆలయం వరకూ రూ.35 లక్షలతో సీసీ రోడ్డు, రూ.12 లక్షలతో రక్షిత మంచినీటి పథకం, రూ.1.32 కోట్లతో రెండు సచివాలయాలు, రెండు ఆర్బీకేల భవనాలు, ఒక వెల్‌నెస్ సెంటర్ భవనం, నాడు–నేడు కింద రూ.1.43 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అదనపు భవనాలు, తరగతి గదుల నిర్మాణం పూర్తిచేసినట్టు తెలిపారు. అలాగే ఎంపీపీ, జెడ్పీ నిధులతో కూడా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు చేతుల మీదుగా భవనాలు, అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.